



హైదరాబాద్ భక్తుల ఆధ్వర్యంలో స్వామివారి ఊరేగింపు

మూట, ముల్లెతో మల్లన్న చెంతకు

నేడే పట్నంవారం..

మూట, ముల్లెలతో బైలెల్లి కొమురవెల్లి క్షేత్రానికి శనివారం సాయంత్రం చేరుకున్నారు నగరవాసులు.. కాళ్లు, చేతులు కడుక్కోకుండా నేరుగా మల్లన్నస్వామిని ధూళిదర్శనం చేసుకున్నారు. ఎటుచూసిన ఆలయపరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. నేటి నుంచి సత్తేటివారాల మహా జాతర ప్రారంభంకానున్నది. పట్నంవారం ఉత్సవానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ కారణంగా ప్రైవేటు గదుల అద్దెలు మండిపోతున్నాయి.

- ప్రారంభం కానున్న జానపదుల మహాజాతర
- భక్తజనంతో ఆలయపరిసరాల కిటకిట
- వసతిగదులు దొరక్క భక్తుల ఇబ్బందులు
- కానరాని ఉచిత వాహన సౌకర్యం
- ప్రైవేటు గదుల అద్దె దోపిడీ
- 510 మందితో పోలీసుల పటిష్ట బందోబస్తు

7



మల్లన్నకు ఒడిబియ్యం, బండారి తీసుకువెళుతున్న భక్తులు



శివయ్య చెంత.. అంజన్న

ఉమ్మడి కల్హేర్ మండల పరిధిలోని నాగధర్ అటవీ ప్రాంతంలో వెలసిన రామేశ్వరం గుట్ట మీద ఉన్న శివలింగం వద్దకు చేరుకున్న వానరం లింగానికి నమస్కారం చేయడం ఆసక్తిగా మారింది. శనివారం జరిగిన ఈ వింతను గ్రామస్థులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు.

-కల్హేర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి)

చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ రగడ

చేగుంటలో మంత్రి హాజరైన కార్యక్రమంలో రసాభాస



చేగుంటలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపై కూర్చోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/చేగుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక నియోజకవర్గంలో శనివారం జరిగిన రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పర్యటన మరోసారి ఆధిపత్యపోరుకు వేదికగా మారింది. అటు బీఆర్ఎస్ కార్యకర్తల నినాదాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ప్రతినినాదాల మధ్య నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వేదికపై ముందు వరసలో కూర్చోగా ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాత్రమే ఉండాలని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే మంత్రి, అధికారులతో అన్నారు. దీనికి మంత్రి కొండా సురేఖ స్పందించి, వెనుక వరసలో కూర్చోవల్సిందిగా శ్రీనివాస్‌రెడ్డికి చెప్పారు. ఆయన కుర్చీలో నుంచి లేచి వెనక సీట్లో కూర్చోకుండా వేదికపై వెనక నిలబడ్డారు.

పేదింటి ఆడపడుచులకు వరం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదింటి ఆడపడుచుల పాలిట వరమని, అందుకే తమ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తున్నదని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు 91 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం గొల్లపల్లిలో రు.11 కోట్లతో ఏర్పాటు చేసిన 33 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డీవో జయచంద్రారెడ్డి, చేగుంట తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
- జాబితాలో గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, కోహీర్
- తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లోకి మరిన్ని గ్రామాలు
- సంగారెడ్డి జిల్లాలో 12కు చేరిన పురపాలికలు

4 మున్సిపాలిటీలు

సంగారెడ్డి జిల్లాలో మరో నాలుగు మున్సిపాలిటీలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. కోహీర్, గుమ్మడిదల మండల కేంద్రాలతోపాటు జిన్నారం మండలం గడ్డపోతారం, పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు ఈ జాబితాలో చోటు దక్కింది. అదేవిధంగా అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో మరిన్ని గ్రామాలను విలీనం చేస్తున్నట్లుగా గెజిట్‌లో పేర్కొన్నారు. తాజా పరిణామాలతో జిల్లాలోని పట్టణాల సంఖ్య 12కు చేరింది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 18: హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న సంగారెడ్డి జిల్లాలో పట్టణీకరణ పుంజుకుంటున్నది. క్రమంగా పట్టణాల్లో నివసించేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్‌లోనూ జిల్లాకు చెందిన 3 కార్పొరేటర్ డివిజన్లు ఉన్నాయి. ఔటర్ పరిధిలోనూ అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలు విస్తరించాయి. జిల్లాలోని మారుమూల పల్లెలు సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, విద్యాసంస్థలు, కార్పొరేట్ కంపెనీలతోపాటు జిల్లా నలుమూలలా జాతీయ, రాష్ట్ర రహదారులు విస్తరించడమే ఇందుకు ప్రధాన కారణాలు.

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

1. గుమ్మడిదల: గుమ్మడిదల మండలంలోని అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, గుమ్మడిదల గ్రామపంచాయతీల విలీనం.
2. గడ్డపోతారం: జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, మాదారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం, గడ్డపోతారం గ్రామపంచాయతీల విలీనం.
3. కోహీర్: కోహీర్ గ్రామపంచాయతీ మాత్రమే.
4. ఇస్నాపూర్: పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్, చిట్కుల్, పాశమైలారం గ్రామపంచాయతీలు విలీనం చేశారు.

గ్రామాలు విలీనం

- ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న అమీన్‌పూర్‌లోకి ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దాయర, కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్ గ్రామాలను విలీనం చేశారు.
- తెల్లాపూర్ మున్సిపాలిటీలో పటాన్‌చెరు మండలంలోని కర్దనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘన్‌పూర్ గ్రామాలను విలీనం చేస్తూ తాజాగా గెజిట్‌లో పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో అగ్రస్థానం

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, ఐడీఏ బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలు ఇప్పటికే ఉన్నాయి. తాజాగా కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్‌లను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయడంతో ఈ సంఖ్య 12కు చేరింది. అదేవిధంగా భారతీనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు జీహెచ్‌ఎంసీ డివిజన్లు జిల్లాలోనే ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మున్సిపాలిటీలు ఉన్న జిల్లాల జాబితాలో సంగారెడ్డి కూడా చోటు దక్కించుకుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ముందు వరుసలో ఉంటాయి. కాగా పటాన్‌చెరు మండలం ఇంద్రేశంతోపాటు కంది మండల కేంద్రాన్ని కూడా మున్సిపాలిటీలుగా ప్రకటిస్తారనే ఊహాగానాలు వచ్చినా జాబితాలో ప్రకటించలేదు.



నవజాత శిశువుకు సీపీఆర్‌తో ఊపిరి

మెదక్ కల్చరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన బిడ్డ శ్వాస అందకపోవడంతో 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణం పోసిన ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. సుభాష్‌నగర్‌కు చెందిన అమీనాబేగం మాతాశిశు కేంద్రంలో ప్రసవించగా, శిశువుకు శ్వాస సంబంధిత సమస్య ఉండంతో నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో బిడ్డ శ్వాస ఆగిపోవడం గమనించిన అంబులెన్స్ సిబ్బంది రాజు, నవీన్ సీపీఆర్ చేశారు. దీంతో శిశువు తిరిగి శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. అనంతరం చిన్నారని నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం అడ్మిట్ చేయించారు.

మహిళలు క్యాబ్ డ్రైవర్లుగా రాణించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో సత్తా చాటుతున్న మహిళలు క్యాబ్‌డ్రైవర్లుగానూ రాణించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని ఎస్‌బీఐ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ వృత్తిలో అధిక శాతం పురుషులే ఉంటారని.. కానీ, మహిళలు 30 రోజుల్లో డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసుకుని పురుషుల కంటే తామేమీ తక్కువ కాదని నిరూపించారని పేర్కొన్నారు. మహిళలు కార్ డ్రైవింగ్‌తో మహిళా ఉద్యోగులకు ఎంతో భద్రత, ప్రయోజనం కలుగుతుందన్నారు. సంగారెడ్డి హైదరాబాద్ ప్రాంతానికి దగ్గరలో ఉన్నందువల్ల ప్రతీరోజు ఎంతో మంది మహిళా ఉద్యోగులు హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నారని, మహిళా క్యాబ్ డ్రైవర్లు అందుబాటులోకి వస్తే వారికి భద్రతపై భరోసా పెరుగుతుందని తెలిపారు. మహిళలు శిక్షణ పొందడంతో సరిపెట్టుకోకుండా లైసెన్సులు కూడా పొందాలన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ శిక్షణ నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. డ్రైవింగ్ వృత్తిలో రాణిస్తూ తమ కుటుంబాలను ఆర్థికంగా ఎదిగిందేకు కృషి చేయాలని చెప్పారు. జిల్లాలో మహిళలకు స్వయం ఉపాధి రుణాల ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన 33 మంది మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం జయశ్రీ, సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, కో ఆర్డినేటర్ శివశంకర్, శిక్షకుడు రామమూర్తి, నర్సింలు, రవిశంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన, హామీపత్రాల స్వీకరణ
- మెదక్ జిల్లాలో 56 మంది, సంగారెడ్డి జిల్లాలో 26 మంది దరఖాస్తు

మెదక్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికతను కోల్పోయి ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మ్యూచువల్ బదిలీల కోసం టీచర్ల దరఖాస్తులను పరిశీలించి హామీ పత్రాలు స్వీకరించి నివేదించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి డీఈవోలకు ఆదేశాలు జారీ అందాయి. పరస్పర బదిలీలకు అంగీకర పత్రాలను ఇద్దరు ఉపాధ్యాయులు పూర్తి వివరాలతో సంతకాలు చేసిన పత్రం అండర్టేకింగ్ సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు హామీ పత్రం, ధ్రువపత్రాల తుది పరిశీలన చేసి ఈనెల 22లోపు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రారంభమైన పరిశీలన

పరస్పర బదిలీల కోసం టీచర్లు సర్టిఫికెట్ల పరిశీలన కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో శనివారం ప్రారంభమైంది. సర్టిఫికెట్లను పరిశీలించి పరస్పర బదిలీలకు అంగీకర పత్రాలను ఇద్దరు ఉపాధ్యాయులు పూర్తి వివరాలతో సంతకాలు చేసిన పత్రం తీసుకుంటున్నారు. టీచర్లపై ఏమైనా పోలీసు కేసులు ఉన్నాయా అని కూడా పరిశీలిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 30 మంది ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు. పరస్పర బదిలీల కోసం జిల్లాలో 56 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నట్లు డీఈవో పేర్కొన్నారు.

తొలిరోజు 50 మంది..

జీవో 317 కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు ఊరట కలిగించేందుకు ప్రభుత్వం తాజాగా స్పౌజ్, అనారోగ్యం, పరస్పర బదిలీలకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో మ్యూచువల్ బదిలీల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. మెదక్ జిల్లాలో పరస్పర బదిలీల కింద 56 మంది దరఖాస్తు చేసుకోగా.. శనివారం 30 దరఖాస్తులను పరిశీలించారు. సంగారెడ్డి జిల్లాలో 26 మందికి తొలి రోజు 20 మంది దరఖాస్తులు పరిశీలించారు. 2022లో మార్చిలో పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వగా తాజాగా మరోసారి ఇచ్చారు. ఈ నెల 22లోపు వెరిఫికేషన్ పూర్తి చేసి నివేదికను అందజేయనున్నట్లు డీఈవోలు తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

సమీక్షా సమావేశంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవంపై కలెక్టరేట్‌లో శనివారం ఆయన జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఉత్తమ ఫలితాలపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వెనుకబడిన అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాముండేశ్వరి వార్షికోత్సవాలు



8

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

- మెదక్ జిల్లాలో 8, సంగారెడ్డి జిల్లాలో 12, సిద్దిపేట జిల్లాలో 10 కేంద్రాలు
- 80 సీట్లకు 4,361 మంది విద్యార్థులు

7



మాయమవుతున్న కోమటికుంట

- వ్యర్థాలతో నింపి.. విక్రయాలు
- 60 గజాల స్థలానికి రూ. 7 లక్షల వరకు
- నాడు 19 ఎకరాలు.. నేడు మూడే..

7



కొలువుల కోట 'కొడకండ్ల'

- ఆ గ్రామంలో 85 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ప్రత్యేక టీచర్ల సంఘం
- ఇతర రంగాల్లో మరో వంద మంది

7



పాలకవర్గంపై విరుచుకుపడిన కాంగ్రెస్

● కౌన్సిల్ హాల్‌కు రూ.40లక్షలు పెట్టడం అధికార దుర్వినియోగమే

● నిధుల దుర్వినియోగంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు వాస్తవాలేనని వెల్లడి

సదాశివపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) :సదాశివపేట బల్దియాలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గత కొద్ది రోజులుగా ఆంధ్రజ్యోతిలో వస్తున్న కథనాలు వాస్తవాలేనని కాంగ్రెస్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రూ.40లక్షల నిధులతో సుందరీకరించిన కౌన్సిల్ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం జరిగిన సందర్భంలో నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, నాగరాజుగౌడ్, గుండు రవి, ఆపార్టీ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో బల్దియా ఖజానా ఖాళీగా ఉందన్నారు. ఇలాంటి దయనీయ స్థితిలో అంతా బాగానే ఉన్న కౌన్సిల్ మీటింగ్ హాల్‌కు యుద్ధప్రాతిపదికన రూ.40 లక్షల ప్రజాధనంతో సుందరీకరించడం అధికార దుర్వినియోగమేనన్నారు.

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మాటలన్నీ అబద్ధాలే...

కౌన్సిల్ మీటింగ్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా చైర్‌పర్సన్ అపర్ణ పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్‌లు పట్టణ ప్రజలకు పూర్తి అబద్ధాలు చెప్పారని మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం ఆరోపించారు. 2022 మే నెలలో స్టడీటూర్ కోసం చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ హయాంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. బల్దియా ఆర్థిక పరిస్థితుల బాగోలేక స్టడీటూర్ వాయిదా వేశారన్నారు. కానీ ఇప్పటి పాలకవర్గం గత 2024 ఆగస్టులో రూ.15లక్షలు స్టడీటూర్ కోసం ఖర్చు చేసిందన్నారు. స్టడీటూర్ వల్ల పాలకవర్గం కౌన్సిలర్లు చండీఘడ్ రాష్ట్రం వెళ్లి నేర్చుకుంది ఏమిలేదన్నారు. సదాశివపేట బల్దియాలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అధికారులు విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

టేక్మాల్, జనవరి18(ఆంధ్రజ్యోతి) : పిల్లలు ప్రతీ రోజు మంచి పౌష్టికాహారం తీసుకుని, కొంత సేపు వ్యాయామం చేయాలని వైద్యాధికారులు శ్రీనివాస్, ఝాన్సీ సూచించారు. శనివారం మండలంలోని సూరంపల్లి , చెరువు ముందటితండా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రామ ఆరోగ్యశాఖ సిబ్బంది, రాష్ట్రీయ బాల స్వస్థ (ఆరోగ్య) కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు పరిక్షించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క బరువు, ఎత్తు, చెస్ట్, హెడ్ కొలతలు చెక్ చేశారు. అనారోగ్య లోపాలు ఉన్న పిల్లలను మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రులకు పంపే ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య తదితరులు పాల్గొన్నారు.

పంట ఎదుగుదలకు జాగ్రత్తలు పాటించాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్‌చారి

నాగల్‌గిద్ద, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పంటల ఎదుగుదలకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని నాగల్‌గిద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్‌చారి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉట్‌పల్లి గ్రామంలో జొన్న పంటను స్థానిక ఏఈవో సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు ఎదుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

బ్యాంకుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలి : డీఎస్పీ

తూప్రాన్, జనవరి 18: (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకుల్లో ఇటీవల కాలంలో దొంగతనాలు, దోపిడీలు జరుగుతున్నాయని వివరించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైన అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో తూప్రాన్ ఎస్ఐ శివానందం, బ్యాంకర్లు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రుల చెంతకు..

రెండు గంటల్లోనే అప్పగించిన సీఐ


తల్లితో చిన్నారి

గజ్వేల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో శుక్రవారం రాత్రి బాలిక అదృశ్యమైన బాలికను గజ్వేల్ సీఐ సైదా కీలకంగా వ్యవహరించి రెండు గంటల్లోనే తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఐఓసీ మైదానం వద్ద గుడిసెలో నివాసం ఉంటున్న మోతే మైసమ్మ-యాదగిరిల కుమార్తె మోతే పున్నమ్మ రాత్రి పది గంటల సమయంలో తప్పిపోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ సైదా తన సిబ్బంది వెంకటేశ్, నరేందర్, కృష్ణ, రాజు గ్రూపులుగా విడిపోయి ఐఓసీ మైదానం చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను వెతికారు. రాత్రి 12గంటలకు పాపను గుర్తించి తల్లిదండ్రులను పిలిపించి క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ సైదాను, పోలీస్ సిబ్బందిని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అభినందించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


శ్రీహరి(ఫైల్)

నర్సాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అప్పులతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం ఎం.శ్రీహరి(35) స్వర్ణకార వృత్తి చేస్తున్నాడు. పనులు సరిగ్గా నడవక మద్యానికి బానిసయ్యాడు. పని మానేయడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు అయ్యాయి. అవి తీరే మార్గం కనిపించక శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. భార్య మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీహరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

చిలప్‌చెడ్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. సానికుల కథనం ప్రకారం ఫైజాబాద్ గ్రామానికి చెందిన వంజరి బుచ్చయ్య ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పశువుల పాకలోకి పాలు పితకడానికి వెళ్లాడు. ఆ సమయంలో కోతుల గుంపు ఒక్కసారిగా బుచ్చయ్యపై దాడి చేశాయి. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. ఆయన అరుపులు విన్న స్థానికులు వచ్చి కోతులను తరమడంతో ప్రమాదం తప్పింది. గాయపడిన బుచ్చయ్యను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ గ్రామంలో కోతులు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయని, ఒంటరిగా బయటికి వచ్చే పరిస్థితులు లేవని గ్రామస్థులు చెప్పారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కొండపాక శివారులో మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం జరిగింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. కోదాడకు చెందిన సయ్యద్ మేరాజ్ అలీ (45) ట్యాక్సీ కారులో సిద్దిపేటలో బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. కారు కొండపాక శివారులోకి రాగానే సిద్దిపేట వైపు ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టడంతో కారులో ఇరుక్క పోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ రఫీక్‌కు గాయాలయ్యాయి. గాయాలైన ఆయనను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి


వెంకటస్వామి(ఫైల్)

తూప్రాన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గెస్ట్‌హౌస్ వద్ద పని చేస్తున్న ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో చనిపోయాడు. శనివారం తూప్రాన్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి కథనం ప్రకారం.. మండలంలోని ఇస్లాంపూర్‌కు చెందిన అడప వెంకటస్వామి (38) తూప్రాన్‌లోని వికాస్‌రెడ్డి గెస్ట్ హౌస్ వద్ద పని చేస్తున్నాడు. ఈ నెల 1న కరెంట్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, శనివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ వైఖరితో రాజ్యాంగ ఉనికికే ప్రమాదం


సంవిధాన్ బచావో ర్యాలీలో మాట్లాడుతున్న వీహెచ్

చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఉనికికి బీజేపీ వైఖరితో ప్రమాదం పొంచి ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు పేర్కొన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేర్యాల లోని గాంధీచౌక్ నుంచి అంగడిబజారు చౌరస్తా వరకు సంవిధాన్ బచావో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వి.హనుమంతరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాలరాసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని దేశప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. అమిత్ షా వైఖరిపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు కృష్ణ, కొమ్ము రవి, పూర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, ఆడెపు నరేందర్, దాసరి శ్రీకాంత్, ముస్త్యాల యాదగిరి, బందిగ రాకేశ్‌కృష్ణన్, ఆది శ్రీనివాస్, మల్లిగారి నర్సింహులు, మామిడాల నాగరాజు, వంగ జయ, రేకులపల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌ను కలిసిన నాయకులు

కొండపాక, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చేర్యాలకు వెళ్తున్న వీహెచ్‌కు మండలంలోని తిమ్మారెడ్డి పల్లి వద్ద సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు శనివారం స్వాగతం పలికారు. హనుమంతరావు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులతో కొద్దిసేపు మాట్లాడారు. టీపీసీసీ కార్యదర్శి గంప మహేందర్ రావు. పీసీసీ సెక్రెటరీ లక్ష్మన్ యాదవ్, ముద్దం లక్ష్మి, వహీద్ ఖాన్, బొమ్మల యాదగిరి, షాబు, అక్బర్, ప్రవీణ్, రజిని, సన, ప్రసాద్ తదితరులు హనుమంతరావు కలిసిన వారిలో ఉన్నారు.

సింగపూర్‌లో సీఎం రేవంత్‌ను కలిసిన సునీత



జగదేవ్‌పూర్ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ కల్చరల్ సొసైటీ(సింగపూర్) వైస్ ప్రెసిడెంట్ మొగిలి సునితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం సింగపూర్‌లోని గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి విచ్చేసిన రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ కల్చరల్ సొసైటీ చేపడుతున్న పలు కార్యక్రమాల వివరాలను ఆమె సీఎంకు వివరించారు. కార్యక్రమంలో కల్చరల్ సొసైటీ అధ్యక్షులు గడప రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మూట, ముల్లెతో మల్లన్న చెంతకు..

నేడే పట్నంవారం..

- ప్రారంభం కానున్న జానపదుల మహాజాతర
- భక్తజనంతో ఆలయపరిసరాల కిటకిట
- వసతిగదులు దొరక్క భక్తుల ఇబ్బందులు
- కానరాని ఉచిత వాహన సౌకర్యం
- ప్రైవేటు గదుల అద్దె దోపిడీ

510 మందితో పోలీసుల పటిష్ట బందోబస్తు


శనివారం రాత్రి ఆలయం వద్ద భక్తుల రద్దీ



భక్తుల దర్శనం కోసం సిద్ధం చేసిన తాత్కాలిక క్యూలైన్లు

చేర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జానపదుల జనజాతరకు ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సిద్ధమైంది. జాతరలో మొదటి ఆదివారం (పట్నంవారం) మల్లన్న దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన భక్తులు శనివారం సాయంత్రానికి మూటముల్లెతో కొమురవెల్లికి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు క్రిక్కిరిసిపోయాయి. భక్తులు కాళ్లు, చేతులు శుభ్రపరచుకోకుండానే నేరుగా స్వామి వారిని ధూళిదర్శనం చేసుకుని ఒడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మల్లన్నకు బోనాలు, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు మల్లన్న ఆలయగుట్టపై ఉన్న ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించనున్నారు. సోమవారం తోటబావి ప్రాంగణంలో హైదరాబాద్ యాదవసంఘం ఆధ్వర్యంలో పెద్ద పట్నం, అగ్నిగుండాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం స్నానాల కోసం తోటబావి, కోడెల స్తంభం, మల్లన్న చెరువు సమీపంలో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ సిద్ధం చేశారు. ధర్మ, ప్రత్యేక, వీఐపీల క్యూలైన్ ఏర్పాటుచేశారు.

చుక్కలనంటిన ప్రైవేటు గదుల అద్దె

ఆలయ పరిధిలోని గదులను దాతలకు కేటాయించగా, భక్తుల రద్దీ కారణంగా ప్రైవేటు గదుల యాజమానులు మూడు రోజులకు రూ.4-8వేల చొప్పున అద్దె అడ్డగోలుగా వసూలుచేశారు. చిన్నపాటి ఖాళీస్థలంలో తడకలు అడ్డుపెట్టి రూ.2వేలు చొప్పున అద్దెకు ఇచ్చారు. ఆర్థికస్థోమత లేనివారు ఆరుబయట ప్రదేశాలలో గుడారాలు వేసుకోగా, మరికొంత మంది చెట్టునీడన తలదాచుకున్నారు.

కానరాని ఉచిత వాహన సౌకర్యం

కొమురవెల్లి శివారులోనే వాహనాలను ఆపిన నేపథ్యంలో పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులను ఆలయం వరకు తీసుకువచ్చేందుకు ఉచిత వాహన సౌకర్యం ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. కానీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు, ముల్లె, మూటనెత్తినపెట్టుకుని వంట సామగ్రి చేతపట్టుకుని నడుచుకుంటూ వచ్చి తంటాలుపడ్డారు.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి

సిద్దిపేట సీపీ అనూరాధ

పట్నంవారాన్ని పురస్కరించుకుని మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సిద్దిపేట సీపీ అనూరాధ సూచించారు. శనివారం ఆమె మల్లన్న ఆలయాన్ని సందర్శించి క్యూలైన్లు, పార్కింగ్ తదితర ప్రదేశాలు పరిశీలించారు. అనంతరం బందోబస్తు విధుల నిర్వహణ పట్ల పోలీసు సిబ్బందితో సమావేశమై దిశానిర్దేశం చేశారు. 510మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపట్టామని తెలిపారు.

ఫ్లెక్సీలపై బీఆర్ఎస్, సీపీఎం ఆగ్రహం

ఆలయ రాజగోపుర ఆవరణతోపాటు జనం ఎక్కువగా ఉండే ప్రధాన ప్రదేశాలలో కటౌట్లు ఏర్పాటు ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్‌చేశారు.

కొమురవెల్లికి వస్తున్న భక్తులు


మాయమవుతున్న కోమటికుంట

- వ్యర్థాలతో నింపి.. విక్రయాలు
- నాడు 19 ఎకరాలు.. నేడు మూడే..


కోమటికుంటలో ఆక్రమణలు

ఐడీఏబొల్లారం జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదాన్ని పంచాల్సిన చెరువు మాయం అవుతున్నాయి. సంరక్షించాల్సిన అధికారులు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకున్న కబ్జాదారులు కుంటలను ఆక్రమించి, దర్జాగా అమ్ముకుంటున్నారు. ఇంటి నంబర్లు ఇచ్చి అధికారిక ముద్ర వేస్తున్నారు. ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 19 ఎకరాల్లో కోమటికుంట విస్తరించి ఉంది. కుంట చుట్టూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల వారు నివాసం ఉంటున్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న కాంక్ష ఉన్న వారి ఆశలను ఆక్రమణదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల స్థోమతను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. 60 గజాల స్థలాన్ని రూ. 6 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు అమ్ముతున్నారు. స్థలం కావాలనుకునే వారు స్థానిక నాయకులను సంప్రదిస్తే బినామీల పేర్లు చెప్పి వారి వద్దకు పంపుతారు. నేరుగా నాయకులు డబ్బులు ముట్టుకోరు. మాకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తారు. రోజువారీగా అమ్మకాలు జరపడానికి వీలుగా పరిశ్రమల వ్యర్థాలతో పాటు స్థానికంగా విడుదల నిర్మాణ వ్యర్థాలు కుంటలో పోసి నాటకీయంగా ఆక్రమణకు పాల్పడుతున్నారు.

15 ఎకరాల పైచిలుకు ఆక్రమణ

19 ఎకరాల కోమటికుంట ఆక్రమణల్లో చిక్కి ప్రస్తుతం మూడు ఎకరాలు మాత్రమే మిగిలింది. ఎవరికీ అనుమానం రాకుండా కొనుగోలుదారులు వచ్చినప్పుడు వ్యర్థాలను నింపుతూ 60 గజాల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

కేసులు పెడతాం

కోమటికుంట ఆక్రమణ విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయి. ఆక్రమణ చేస్తున్న వారి వివరాలు బయటకు రావడం లేదు. ఆరా తీస్తున్నాం. తప్పకుండా క్రిమినల్ కేసులు పెడతాం. - ప్రసాద్ నీటిపారుదలశాఖ ఏఈ

అక్రమంగా నిర్మిస్తే తొలగిస్తాం

కుంటలో నిర్మాణాలు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ఎటువంటి అనుమతులు మంజూరు చేయడం లేదు. పాత కాలం నాటి ఇంటి నంబర్లు గదులపై వేస్తున్నారు. వాటి విషయంలో విచారణ జరిపిస్తాం.

- పవన్, మున్సిపల్ పట్టణ విభాగం అధికారి


జహీరాబాద్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

4,361 మంది హాజరు

వర్గల్/సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/రామాయంపేట, జనవరి 18: వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి గాను శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని 30 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఆరో తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను 6,465 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, శనివారం నాటి ప్రవేశపరీక్షకు 4,361 మంది విద్యార్థులు హాజరయ్యారు. 2,104 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. మెదక్ జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో 1,589 మంది విద్యార్థులకు గాను 1083 మంది విద్యార్థులు హాజరైనారు. సంగారెడ్డి జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలలో 2,626 మంది విద్యార్థులకు గాను 1613 మంది హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలలో 2,250 మంది విద్యార్థులకు గాను 1665 మంది హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం 67.42 కాగా గైర్హాజరైన విద్యార్థుల శాతం 32.58 అని తెలిపారు.


ఖేడ్‌లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వర్గల్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్

కొలువుల కోట ‘కొడకండ్ల’

ఆ గ్రామంలో 85 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు

- 1960లో ఐదుగురితో మొదలైన ప్రస్థానం
- గ్రామానికి ప్రత్యేక టీచర్ల సంఘం
- ఇతర రంగాల్లో మరో వంద మంది

Sunday Special

గజ్వేల్/గజ్వేల్ రూరల్, జనవరి 18, (ఆంధ్రజ్యోతి): ఒక గ్రామంలో ఒకటి నుంచి పది లేదా 20 మంది ఉద్యోగులు ఉంటారు. ఆ గ్రామంలో ఏకంగా 85 మంది ఉద్యోగులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాదాడి రంగారెడ్డి స్ఫూర్తితో మొదలైన ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుంది. ఆ గ్రామమే గజ్వేల్ మండలం కొడకండ్ల. 1960లో నలుగురు ఉద్యోగులతో మొదలైన ఈ గ్రామంలో ప్రస్తుతం 85 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఇందులోనూ అత్యధికంగా టీచర్లు ఉండడం ఈ గ్రామం ప్రత్యేకత. సీనియర్ గురువులను ఆదర్శంగా తీసుకుని నేటి యువత పట్టుబట్టి చదువుతుండడం.. వారికి సీనియర్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకారం అందిస్తుడడంతో గ్రామంలో కొలువుల కోటగా మారింది. గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన మాదాడి రంగారెడ్డి అగ్గిపెట్టెపైన పేరు రాసిస్తే కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేవారని ఇప్పటికీ వృద్ధులు చెబుతుంటారు. అలాంటి వ్యక్తి జన్మించిన కొడకండ్లలో ప్రస్తుతం యువకులు పోటీపడి మరీ చదివి ఉద్యోగాలు సాధిస్తుండడం నిజంగా గొప్ప విషయమనే చెప్పవచ్చు.

ఇంటికో గ్రాడ్యుయేట్..

గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో మొత్తం 3100 జనాభా ఉండగా, సుమారు 400 మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఇంటికో గ్రాడ్యుయేట్ ఉండడంతోపాటు ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లో దాదాపు 50మంది చదువుకున్నారు. ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా గ్రామం నుంచి ఒక్కరైనా ఉద్యోగం సాధించడం ఈ గ్రామం ప్రత్యేకత. రాష్ట్రంలోనే ఓ గ్రామంలో ప్రత్యేక టీచర్ల సంఘం ఉందంటే అది కొడకండ్లనే అని చెప్పవచ్చు. కొడకండ్ల టీచర్స్ అసోసియేషన్ (కేటీఏ) పేరిట ప్రత్యేక టీచర్ల సంఘం ఏర్పాటు చేసి, ఆయా సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నారు. గ్రామంలో మొత్తం మంది 25 ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక ఆర్మీ, నేవీ, పోలీస్, వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్ సంస్థ, పంచాయతీ కార్యదర్శులుగా ఇలా అనేక రంగాల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ప్రైవేటు రంగంలోనూ ఈ గ్రామంలో దాదాపుగా వంద మంది వరకు ఉద్యోగాలు చేస్తున్నారు. విద్యుత్ శాఖలో, వైద్య శాఖలో ఇతరత్రా ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు.



గజ్వేల్ మండలంలోని కొడకండ్ల రైల్వేస్టేషన్

సోదరుల సహకారంతో..



చిన్నతనం నుంచి ఉపాధ్యాయులను చూస్తూ పెరగడం... వారి బోధనతో ఇంటర్‌లోకి వచ్చేసరికి ఉపాధ్యాయ వృత్తిలో చేరాలన్న ఆకాంక్ష బలపడింది. అదే సమయంలో నాన్న చనిపోవడంతో సోదరుల సహకారంతో బీఈడీ పూర్తి చేశాను. 2008లో డీఎస్సీలో ఎంపిక కావడంతో ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరా. కొడకండ్ల టీచర్స్ అసోసియేషన్ స్థాపించి మొన్నటి కరోనా విపత్కర పరిస్థితిలో వలస కూలీలకు, పేదలకు నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టాం.

దీకొండ శ్రీశైలం, ఉపాధ్యాయుడు

తల్లిదండ్రుల సహకారంతోనే..



అమ్మానాన్న అక్కరాజు మల్లయ్య-భాగ్యమ్మలు నేను రెండో సంతానం. కష్టపడి చదివించారు. ఉద్యోగం సాధిస్తేనే తల్లిదండ్రుల కష్టాలు తీరుతాయని బలంగా నమ్మి.. అందుకు అనుగుణంగా కష్టపడి చదివాను. 2005లో సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం సాధించా.

- అక్కరాజు నర్సింలు, సీఆర్‌పీఎఫ్

గ్రంథాలయం కావాలి



గ్రామంలో పూర్తిస్థాయి అధునాతన హంగులతో గ్రంథాలయాన్ని నిర్మించాలి. కోచింగ్ సెంటర్లకు వెళ్లి హాస్టళ్లలో ఉంటూ ఆర్థికంగా భరించలేని అనేక మంది యువతీ, యువకులు పోటీపరీక్షలకు దూరంగా ఉంటున్నారు. యువత పోటీ పరీక్షలకు చదువుకునేందుకు వీలుగా అన్ని రకాల పుస్తకాలను, కంప్యూటర్లతో కూడిన డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తే యువతీ, యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

- చేర్యాల రామచంద్రం, ఉపాధ్యాయుడు

మొదటి పోలీస్ జాబ్ నాదే..



మా ఊర్లో నేనే మొదటి పోలీస్ ఉద్యోగం సాధించా. అప్పటికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నా పోలీస్ ఉద్యోగం ఎవరికీ రాలేదు. ఏలాగైనా జాబ్ కొట్టాలన్న సంకల్పంతో 1990లో పోలీస్ జాబ్ కొట్టాను. మా అమ్మమ్మ-తాత కోరిక మేరకు పోలీస్ ఉద్యోగాన్ని సాధించా. మా అమ్మ 1985లో చనిపోవడం, నా ముగ్గురు తమ్ముళ్లు, సోదరి బాధ్యత నాపైనే పడింది. అప్పటి మా గ్రామ సర్పంచ్ భూపతిరెడ్డి ప్రోత్సహించాలి.

- పంపరి నర్సింలు, హెడ్ కానిస్టేబుల్

పార్కు ప్రారంభమెప్పుడో?

- 95 శాతం పనులు పూర్తయినా అందుబాటులోకి రాని బొంతపల్లి అర్బన్ పార్కు
- సందర్శించిన కలెక్టర్
- పెండింగ్ పనులపై ఆరా


బొంతపల్లి లోని ప్రారంభానికి నోచుకోని అర్బన్ పార్కు

గుమ్మడిదల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి ఫారెస్టు అర్బన్ పార్కు ప్రారంభానికి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వం పట్టణ ప్రజల సౌకర్యార్థం సకల వసతులతో పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇక్కడి ఫారెస్టులోని కొంత భూమిలో అర్బన్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు హెచ్ఎండీఏ అధికారులు దాదాపు 690 హెక్టార్ల భూమిలో రూ.లక్షలు ఖర్చు చేసి ఫారెస్టు చుట్టూ ఫెన్సింగ్, ఎంట్రీ ద్వారం, రోడ్లు, వాచ్ టవర్, గజిబో తదితర పనులు చేపట్టారు. దాదాపు 95 శాతం పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం : కలెక్టర్

గుమ్మడిదల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం బొంతపల్లిలోని అర్బన్ పార్కును సందర్శించారు. స్థానిక అధికారులతో కలిసి కలియతిరిగి పనులపై ఫారెస్టు అధికారులను ఆరా తీశారు. పెండింగ్ పనుల వివరాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి వస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మిగిలిన పనులను పూర్తి చేసి త్వరలో పార్కు ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో ఉమాదేవి ఫారెస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 18 : సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కోటేశ్వర్‌రావు తెలిపారు. కౌడిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మాసాగర్, మహ్మద్‌నగర్, కన్నారం, సదాశివపల్లి, పాంపల్లి , దేవులాపల్లి తదితర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి రిలే నిరాహార దీక్షలు

మాసాయిపేట. జనవరి 18 .(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచి ఐదు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు టీజేఏసీ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జిన్నా నాగరాజు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేషస్పందన

జహీరాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని జహీరాబాద్ డిపోమేనేజర్ జాకీర్‌హుస్సేన్ శనివారం తెలిపారు. ప్రయాణికులు తెలిపిన సమస్యలను నోట్ చేసుకున్నామని, దశలవారీగా వాటిని పరిష్కరిస్తామన్నారు.

కుంభమేళాకు ఆహ్వానం


సంగ్రాం మహారాజ్

నారాయణఖేడ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద నిర్వహిస్తున్న మహాకుంభ మేళలో పాల్గొనాలని అఖిత భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్‌కు కుంభ మేళ నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రాన్ని విమానం టికెట్లను పంపించారు. దీంతో శనివారం సంగ్రాం మహారాజ్ , ఇరక్‌పల్లికి చెందిన దేవిదాస్ మహారాజ్, ఏడుపాయల మహారాజ్‌తో కలిసి కుంభమేళలో పాల్గొనేందుకు వెళ్లారు.

రూ.40లక్షలతో కౌన్సిల్ మీటింగ్ హాల్ సుందరీకరణ

సదాశివపేట, జనవరి 18: (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట బల్దియా కార్యాలయంలో రూ.40 లక్షల నిధులతో సుందరీకరించిన కౌన్సిల్ మీటింగ్ హాల్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 2024 ఆగస్టు నెలలో పాలకవర్గం, కౌన్సిలర్లు చండీఘడ్ స్టడీటూర్ వెళ్లి అక్కడి అభివృద్ధిని అధ్యయనం చేసి ఇక్కడి కౌన్సిల్ మీటింగ్ హాల్‌ను ఆధునిక హంగులతో సుందరీకరించామన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో పట్టణాభివృద్ధికి (టియూఎఫ్ఐడీసీ) పథకం కింద 2023 సంవత్సరంలో రూ.19 కోట్లు, 2024 సంవత్సరంలో రూ.17 కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్, శివరాజ్‌పాటిల్, కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, పిచరాగడి రేణుక, కో అప్షన్ సభ్యుడు ఖలీంపాటిల్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 18: తాళ్లం వేసి ఉన్న ఇంట్లో చోరబడి నగదు, నగలు దొంగతనం చేసిన సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నసీరోద్దిన్‌ఖాన్ ఈ నెల 12న ఇంటికి తాళ్లం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటిపక్కల వారు చూసే సరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో వారు ఇంటి అతడికి సమాచారం అందించారు. ఇంటికొచ్చి చూసే సరికి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోని నగదు, బంగారు అభరణాలు కనిపించలేదు. మొత్తం రూ.3,20,000 విలువ చేసే నగలు చోరీకి గురైన గుర్తించారు. ఈ విషయం పై బాధజతుడు నసీరోద్దిన్ ఖాన్ స్థానిక పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఇదే గ్రామంలో కిరాయికి ఉంటున్న నాచారం లావణ్య ఇంట్లో 14 మాసాల బంగారం , 20 తులాల వెండి అభరణాలు లతో పాటు ఇప్ప ప్రభకర్‌కు చెందిన హోండా యాక్టివా స్కూటీని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకుపోయారు. సమాచారం అందుకున్న నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి సంఘటనాకి చెరుకుని క్లూస్‌టీంని రప్పించి ఆధారాలు సేకరించారు. ఇదే విషయంపై కౌడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమొదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ మధ్య తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయంలో హుండీ..

రామాయంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దొంగలు పడ్డారు. గుడి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు హుండీ ధ్వంసం చేశారు. దీనిలో భక్తులు వేసిన సుమారు రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. ఈ మేరకు ఎస్సై బాలరాజ్ ఆలయం వద్దకు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడికి రిమాండ్

శివ్వంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలల క్రితం బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడిని పోలీసులు శనివారం రిమాండ్ తరలించారు. ఈ ఘటన మండలంలో ఓ గ్రామం లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఓ యువకుడు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. ఈ మేరకు బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో బాలికను కిడ్నాప్ చేసిన యువకునిడిని అదుపులోకి తీసుకొని శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

నేటి నుంచి చాముండేశ్వరి వార్షికోత్సవాలు



చిలప్‌చెడ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొలిచిన వారికి కొంగు బంగారంగా పేరుగాంచిన మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరానది ఒడ్డున వెలిసిన చాముండేశ్వరి అమ్మవారి 42వ వార్షికోత్సవాలు నేడు ప్రారంభం కానున్నాయి. దక్షిణ భారత దేశంలోనే రెండవ పెద్ద చాముండేశ్వరి ఆలయంగా పేరుగాంచింది. నేటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. మూడు రోజులుపాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నివేదనలు కొనసాగుతాయని ఆలయ ప్రధాన పూజారి ప్రభాకర్ శర్మ తెలిపారు.

మూడు నెలలపాటు లక్ష్మీనర్సింహస్వామి జాతర



శివ్వంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన దట్టమైన కొండల మధ్య వెలిసిన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి జాతర నేటి నుంచి జరగనున్నది. మూడు నెలల పాటు ప్రతి ఆదివారం ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి. ఈ జాతరకు ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ముంబై, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పుణ్య కోనేరులో స్నానాలు ఆచరించి కాలినడకన కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో శశిధర్ గుప్తా, ప్రధాన పూజారి ధనుంజయ శర్మ తెలిపారు.

గందరగోళంగా తూప్రాన్ మున్సిపల్ సమావేశం

- టేబుల్ ఎజెండా అంశాలు తెలపకపోవడంపై అధికార పక్షం అలక



సమావేశంలో మాట్లాడతున్న చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

తూప్రాన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మున్సిపల్ సమావేశం శనివారం గందరగోళ పరిస్థితుల మధ్య జరిగింది. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ మున్సిపాలిటీకి విచ్చేసి సమావేశ మందిరానికి వెళ్లారు. కొంత సమయానికి ఆరు, ఏడో వార్డు కౌన్సిలర్లు పల్లెర్ల జ్యోతి రవీందర్‌గుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి సమావేశానికి హాజరై సమావేశ ముందిరంలో కూర్చుండిపోయారు. సభ్యులకు తెలియకుండా టేబుల్ ఎజెండా తీర్మాన అంశాలు రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, రాజు, ప్రియాంక, మామిడి వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేస్తూ సమావేశానికి దూరంగా ఉన్నారు. వీరికి ప్రతిపక్ష సభ్యులు కూడా జత కట్టడంతో కోరం లేక చైర్‌పర్సన్, మరో ఇద్దరు సభ్యులు గంటల తరబడి సమావేశ మందిరంలో కూర్చుండిపోయారు. బతిమిలాడటంతో రెండున్నర గంటలు ఆలస్యంగా సభ్యులు హాజరు కావడంతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఐదు నిముషాల్లోనే ప్రతిపక్ష సభ్యులు వెళ్లిపోగా, 20 నిముషాల్లోనే సమావేశం ముగించారు. తూప్రాన్ మున్సిపల్ సమావేశంలో 27 ఎజెండా అంశాలు పెట్టగా అందులో 25 అంశాలు రూ. 99 వేలకు చెందిన అంశాలేనని మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆరోపించారు. సమావేశం ముగియగానే కార్యాలయ ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. కొత్త చైర్మన్ పదవి ఎక్కిన నుంచి 8నెలల్లో మున్సిపల్ సంపద కొల్లగొట్టారని ఆరోపించారు.

రూ. 142 కోట్ల పనులకు ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

రామచంద్రాపురం, జనవరి 18, (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీలో రూ.142 కోట్లతో 350 పనుల చేపట్టేందుకు ఆమోదం లభించింది. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితాసోమిరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీలో విలీనమైన పాటి, కర్దనూర్, ఘనపూర్, ముత్తంగి, పోచారం గ్రామాలను కలుపుకుని సమావేశంలో అభివృద్ధిపై చర్చించారు. కమిషనర్ ఎం.సంగారెడ్డి మాట్లాడుతూ కొత్త పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. లలితాసోమిరెడ్డి పాలక వర్గానికి చివరి సమావేశం కావడంతో కౌన్సిలర్లు ఒకింత భావోద్వేదానికి గురయ్యారు. విజయవంతంగా ఐదు సంవత్సరాలు పాలన అందిచినందుకు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బి.రాములుగౌడ్, డీఈఈ వెంకటరమణ, ఏఈ మౌనిక, అకౌంట్స్ అధికారి కృష్ణయ్య, ఆర్‌వో వెంకటరామయ్య, ఎలక్ట్రికల్ ఏఈ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 4, 9 వార్డుల్లో రూ.కోటితో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆయన భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 20 కోట్లతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టగా 80 శాతం పూర్తయ్యాయన్నారు. రూ.15 కోట్లతో త్వరలో తాగునీటి పైప్‌లైన్ల పనులు చేపడతామన్నారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్, మాజిద్, నర్సింలు, సవిత హన్మంతు, సంధ్యారాణిరామక్రిష్ణ, సేవాలాల్ సంఘంరాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

ఐడీఏబొల్లారం;; జనవరి 18(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ రోజాబాల్‌రెడ్డి అన్నారు ఈ మేరకు శనివారం ఐడీఏబొల్లారం పట్టణంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షణ జరిపారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ 22వార్డులు 45 ప్రాంతాల్లో రూ.28కోట్లతో సీసీరోడ్డు, భూగర్భ మురుగునీటి పైపులైన్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. రూ.26.8కోట్లతో మిషన్ భగీరథ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, జనవరి18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో హింది గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో ఫాతిమా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతులకు మెరుగైన పరిహారాన్ని అందిస్తాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


రైతుల భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం, జనవరి 18, (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం ఉస్మాన్‌నగర్ నుంచి రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం వట్టినాగులపల్లి వరకు ఏర్పాటు చేస్తున్న వంద ఫీట్ల రోడ్డు పనులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు ఆశించిన పరిహారం అందించకపోవడంతో రోడ్డు నిర్మాణానికి రైతులు భూములు ఇవ్వడంలేదని గుర్తించిన ఎమ్మెల్యే శనివారం సదరు రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారాన్ని ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ముఖ్య ప్రణాళికాధికారి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ చిట్టిఉమేశ్వర్, నాయకులు పర్వ శ్యాంరావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నెలల తర్వాత మొబైల్ ఫోన్ రికవరీ


బాధితుడికి మొబైల్ ఫోన్ అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఔరంగబాద్ గ్రామానికి చెందిన పెంటయ్య 2023 జూన్‌లో ఫోన్ మిస్ చేసుకున్నాడు. దీంతో మొబైల్ పోయిందని స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వగా ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నంబర్‌ను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. గత వారం ఫోన్‌ను ఉత్తరప్రదేశ్‌లో ఆన్ చేయగా, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సమాచారం సేకరించి మొబైల్ దొరికిన వ్యక్తికి 94 బీఎన్ఎస్ఎస్ ప్రకారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నోటీసు పంపామన్నారు. అతనను వెంటనే బయపడి కొరియర్ ద్వారా జిల్లా పోలీసు కార్యాలయానికి ఫోన్‌ను పంపినట్లు ఏఎస్పీ తెలిపారు. శనివారం బాధితుడు పెంటయ్యకు మొబైల్ ఫోన్ అందజేసినట్లు ఆయన వెల్లడించారు.

'బస్తీదర్శన్'తో సమస్యల గుర్తింపు

రామచంద్రాపురం టౌన్ జనవరి 18(ఆంధ్రజ్యోతి) : బస్తీదర్శన్ కార్యక్రమంతో ప్రజల సమస్యలు గుర్తిస్తున్నట్లు కార్పొరేటర్ పుష్పానగేష్‌యాదవ్ తెలిపారు. శనివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్ నగర్ కాలనీలో అధికారులతో కలిసి ఆమె బస్తీదర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రఘురాంరెడ్డి, అరుణ్ సింగ్, బలరాం, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, శ్రీరాం, భద్రయ్య తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్


విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

చేగుంట, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. చేగుంట మండలం వడియారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో చిన్నరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్లు ఖాళీ చేయాలంటూ కోర్టు ఆదేశాలు


పోలీసులతో మాట్లాడుతున్న బాధితులు

ఐడీఏబొల్లారం జనవరి 18(ఆంధ్రజ్యోతి) 15 ఏళ్ల క్రితం నిర్మించుకున్న గృహాలు ఖాళీ చేయాలంటూ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో 20 మంది బాధితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలోని సర్వేనంబరు 12 అంటూ 15 ఏళ్ల క్రితం జయరాంరెడ్డి, సురేందర్ ప్రసాద్‌లు 1.9ఎకరాల భూమిలో 20 మందికి ప్లాట్లుగా విభజన చేసి అమ్మకాలు జరిపారు. ఆ సర్వే నంబరు 12 కాదు ఒకటవ సర్వే నంబరు అంటూ 1.9 ఎకరాల భూమి యజయాని యాదవరెడ్డి సంగారెడ్డి జిల్లా కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాలు జరిగిన తరువాత సర్వేనంబరు 12 పేరుతో ఒకటవ సర్వేనంబరులోని నిర్మించుకున్న ఇళ్ల యజమానులను ఖాళీ చేయాలంటూ న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసులు రంగప్రవేశం చేశారు. 15 ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్లను ఖాళీ చేయడానికి మూడు రోజులు గడువు ఇస్తున్నామని పోలీసులు బాధితులకు చెప్పారు.

ముమ్మరంగా సర్వే


అన్నాసాగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

న్యూస్ నెట్‌వర్క్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది. శనివారం మెదక్, సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి, బొంతపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ దీక్షిత్, ఏవో స్రవంతి, డీటీ కౌశిక సర్వే చేపట్టారు. రామాయంపేట మండలం శివాయపల్లి గ్రామ శివారు బీడు భూముల వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ సేకరించారు. జోగిపేట మండలంలోని అన్నాసాగర్, పోసానిపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా పంచాయతీ అధికారి, అందోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబ తాండ్లే తనిఖీ చేశారు. చౌటకూర్‌లో సర్వే బృందాల పనితీరును సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. ఐడీఏబొల్లారం పట్టణంలో రేషన్‌కార్డుల సర్వేను నిర్వహించారు. మున్సిపల్ పట్టణంలో 150 ఇళ్లల్లో పూర్తయిన సర్వే వివరాలను మున్సిపల్ కమిషనర్ మంగతాయారు అడిగి తెలుసుకున్నారు. హవేళిఘణపూర్‌లో సర్వేను మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి పరిశీలించారు. పెద్దశంకరంపేట మండలంలో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ గ్రేస్‌బాయ్ పరిశీలించారు. అలాగే నిజాంపేట మండల కేంద్రంతో పాటు నగరం గ్రామంలో జరుగుతున్న సర్వేను జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.